ప్రజాశక్తి
ఆదివారం 27 ఏప్రిల్ 2025
5
పార్వతీపురం మన్యం

ఇవిఎంల గోదాంలో తనిఖీలు

ప్రజాశక్తి – పార్వతీపురంటౌన్

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద గల ఇవిఎం గోదామును జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా శనివారం ఆయన గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీళ్లను ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పర్యవేక్షణ రిజిష్టరులో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశిస్తూ, ఏర్పాట్లపై పరిశీలించి అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

అందని ఆరోగ్య ఆసరా

8నెలలుగా అందని భృతి • రోగులు విలవిల

వైద్యం కోసం కోట్లాది రూపాయలు కూటమి సర్కార్ ఖర్చు చేస్తుందని, కార్పొరేట్ తరహాలో ఆసుపత్రులు నిర్మిస్తున్నామని, మీ ఆసుపత్రుల్లో వైద్య నిపుణులను పోస్టులు భర్తీ చేస్తామని, వైద్యం కోసం ఎక్కడికీ వెళ్లకుండా మీ గ్రామంలోని వైద్య సేవలందిస్తున్నామని పాలకులు చెబుతున్న మాటలు ఆచరణలో మచ్చుకైనా కనిపించడం లేదు. 8 నెలలు గడుస్తున్నా ఆరోగ్య ఆసరాకు ఒక్క రూపాయి కూడా కూటమి సర్కార్ విడుదల చేయకపోవడంతో రోగులు ఆందోళన చెందుతున్నారు.

ప్రజాశక్తి – సీతంపేట

రోగులకు వైద్య సేవలతో పాటు ప్రోత్సాహం అందించాలని ఆరోగ్యశ్రీలో ఆసరా పథకం గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆసుపత్రికి వచ్చిన కొంతమంది రోగులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అయిన తర్వాత బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. దీంతో పాటు పౌష్టికాహారం తీసుకొలేని పేదలకు ప్రోత్సాహం కింద వారికి వచ్చిన రోగాన్ని బట్టి వ్యాధిగ్రస్తులకు ప్రోత్సాహం కింద కొంత నగదు ఆసరా పథకంలో భాగంగా రోగి ఖాతాలో జమచేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఒక రూపాయి చెల్లించకపోవడంతో రోగులు విలవిలలాడుతున్నారు ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలు ఆసుపత్రిలో అందుతున్నాయి. కానీ ఆసరా అందకపోవడంతో వీటి కోసం రోగులు ఎదురుచూస్తున్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య ఆసరా ద్వారా 1519 వ్యాధులకు ఆసరా లభించేది. మలేరియా, డెంగీ, శస్త్ర చికిత్సలు, బిపి షుగర్ ఇలా తదితర వ్యాధిని బట్టి సుమారు 1500, 5000, నుంచి గరిష్టంగా రూ.10వేలు వరకు ఆసరా వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రతినెలా సగటున ఆసరా అర్హతకు సుమారు 150 కేసుల వరకు నమోదవుతున్నాయి. 2024 సెప్టెంబర్‌లో ఆరోగ్యశ్రీ కేసులు 230 నమోదు కాగా, ఆసరా అర్హతకు 131 కేసులు వచ్చాయి. అలాగే అక్టోబర్‌లో 131, నవంబర్‌లో 110, డిసెంబర్‌లో 101, జనవరిలో వంద, ఫిబ్రవరిలో 120, మార్చిలో 131, ఈనెల 112 కేసులు ఆసరాలో ఇప్పటి వరకు నమోదయ్యాయి. వీరంతా నగదు ఎప్పుడు వస్తాదానని ఎదురుచూస్తున్నారు.

బడ్జెట్ రావడం లేదు

ఎన్టీయార్ ఆరోగ్య ఆసరాకు నిధులు రావడం లేదు. ఆరోగ్యశ్రీలో వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు అందుతున్నాయి. కానీ ఆసరాలో అర్హత పొందిన రోగులకు బెడ్ రెస్ట్ కోసం ప్రోత్సాహం కింద కొంత నగదు ఇచ్చేవారు. అవి ప్రస్తుతం అందడం లేదు.

బి శ్రీనివాసరావు, సూపరింటెండెంట్,
ఏరియా ఆసుపత్రి సీతంపేట.

గతంలో చెల్లించారు

జ్వరం వచ్చినా ఆపరేషన్ అయినా, శరీరంలో ఏ భాగమై విరిగిపోయిన చికిత్స అయినా అనంతరం ఆ రోగి జీవన భృతి కింద ఆరోగ్య ఆసరా గతంలో చెల్లించేవారు ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఆరోగ్య ఆసరా చెల్లించాలి.

నిమ్మక నారాయణరావు,
కంబ గూడ , సీతంపేట మండలం

స్వర్ణాంధ్రలో భాగస్వామ్యమయ్యేలా చర్యలు

ప్రజాశక్తి – పార్వతీపురం

జిల్లాలో వ్యవసాయ ఆధారిత ఆహార, చేతి వస్తు తయారీ పరిశ్రమలు పర్యాటక, సేవా రంగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచి జిల్లాను స్వర్ణాంధ్రలో భాగస్వామ్యమయ్యేలా అధికారులు చర్యలు తీసుకొని వికసిత భారత్‌కు బాటలు వేయాలని ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ సూచించారు. జిల్లాలో " కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాల పైన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యాన సమీక్షించారు. ఈ సమీక్షలో ఉపాధిహామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం, 2019 – 24 మధ్య జరిగిన అవకతవకలు, ప్రస్తుత అమలు తీరుపైన సమీక్షించారు. అలాగే ప్రతి గ్రామ పరిధిలోని ప్రతి ఇంటికి సురక్షిత తాగు నీరిచ్చే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జల్ జీవన్‌బిమిషన్ అమలు తీరు, గ్రామీణ సడక్‌బియోజన, లాక్ పతి దీదీ, గరీబ్ కళ్యాణ్ అన్నయోజన, పీఎం సూర్యఘర్, కుసుమ్, పీఎంఆవాసయోజన, పీఎం విశ్వకర్మ యోజన, పీఎం స్వనిధి వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల అమలు తీరుతో పాటు, పర్యాటక రంగం అభివృద్ధి తదితర అంశాల పైన సమీక్షించారు. జిల్లాలో మెటీరియల్ కాంపోనెంట్ సద్వినియోగం చేసుకున్నందుకు అధికారులను అభినందించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి సబ్‌కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ దినకర్

44 కేజీల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి – పార్వతీపురం టౌన్

ఒడిస్సా నుంచి తమిళనాడుకు 44 కేజీల గంజాయి ప్యాకెట్లను కారులో రవాణా చేస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సిఐ కె.మురళీధర్ తెలిపారు. ఈ మేరకు స్థానిక పట్టణ పోలీసు స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందస్తు సమాచారం మేరకు శనివారం ఉదయం పట్టణ ఎస్ఐ గోవింద తన సిబ్బందితో కలిసి రాయగడ రోడ్ చివర ఉన్న పెట్రోల్ బంకు వద్ద ముమ్మర తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో డ్రైవర్‌తో సహా ఐదుగురు వ్యక్తులు ఉన్న కారు రాగా, క్లూస్ టీం ఆ కారును తనిఖీ చేసిందన్నారు. ఆ కారులో 44 కేజీలు గల 22 గంజాయి ప్యాకెట్ల దొరికాయని, వీటి విలువ సుమారుగా రూ.5 లక్షలు ఉంటుందని తెలిపారు. అప్పటికే తమిళనాడుకు చెందిన సురేష్ కృష్ణ, మణికందన్ గోపాలకృష్ణ, విజయమురగన్, పొన్నప్పన్, మణికందన్ యలయత్తం, జయరాం పెరుమాళ్ పారిపోవడానికి ప్రయత్నించగా పోలీస్ సిబ్బంది సాయంతో ముద్దాయిలను పట్టుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కారును, గంజాయిని స్వాధీనపర్చుకున్నామన్నారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

విద్యార్థికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసలు

ప్రజాశక్తి – కురుపాం

పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు, ప్రధానోపాధ్యాయులకు, ప్రిన్సిపాళ్లకు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ శనివారం పార్వతీపురంలోని కలెక్టరేట్‌లో ప్రశంసాపత్రాలు అందజేసి, అభినందించారు. ఇందులో భాగంగా స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మర్రాపు రిషిత 591 మార్కులు సాధించి జిల్లాలో జెడ్‌పి హైస్కూళ్లలో ప్రథమ స్థానం, జిల్లాలో ద్వితీయ స్థానం సాధించినందుకు గానూ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సత్కరించారు. రిషితతో పాటు హెచ్‌ఎం తోట శంకరరావును కూడా సత్కరించారు. కార్యక్రమంలో ఇంచార్జి డిఇఒ రమాజ్యోతి, ఎస్ఎస్ ఎపిసి ఆర్. తేజేశ్వరరావు, విశ్రాంత డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, ఉప విద్యాశాఖాధికారులు, ఎంఇఒలు, ప్రిన్సిపాళ్లు, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినిలు మరడ గాయత్రి (588), మరడాన భావన (584), చొంగల వర్షిణి (583)ను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మూకల పెంటయ్య పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని రేగులపాడు కెజిబివి పాఠశాలకు చెందిన జి.నందిని (582), ఎం.శ్రీవిద్య(575) పదో తరగతి ఫలితాల్లో ప్రతిభా చాటారు. వీరిని జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలను అందజేసి ఆశీర్వదించారు. అలాగే ప్రిన్సిపల్ ఉషారత్న కుమారిని కూడా అభినందించారు.

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కాలేజీకి చెందిన వి.త్రివేణి (567)ని, ప్రిన్సిపల్ ఎస్.సంధ్యారాణిని జిల్లా కలెక్టర్ అభినందించారు.

ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి

ప్రజాశక్తి – కురుపాం

జమ్మూ– కాశ్మీర్ పహల్గామాలో 28 మంది పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగనాయుడు డిమాండ్ చేశారు. మండలంలో దురిబిలిలో శనివారం సిపిఎం నాయకులతో కలిసి ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశమంతా కులాలకు, మతాలకు అతీతంగా భిన్నత్వంలో ఏకత్వంలో కలిసి మెలిసి ఉండడాన్ని చూసి ఓర్వలేక ఉగ్రవాదులు పర్యాటకులపై దాడి చేయడం అన్యాయమని, ఇది కేవలం పర్యాటకులే కాకుండా భారతీయులందరిపై దాడి చేశారని, కావున యావత్ భారతీయులంతా ఐక్యంగా ఉగ్రవాద దాడులను ఖండించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇటువంటి సంఘటన పునరావృతం కాకుండా భద్రత కట్టుదిట్టం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆర్మీ రంగంలోకి తీసుకొచ్చిన మార్పుల వల్ల ఇలాంటి సంఘటనలో జరగడానికి ఒక రకమైన కారణమన్నారు. ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు

పార్వతీపురం: కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులకు నిరసనగా యుటిఎఫ్ ఆధ్వర్యాన స్థానిక ఏరియా ఆసుపత్రి జంక్షన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు కొవ్వొత్తులతో ఉపాధ్యాయులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారికి ఉపాధ్యాయులు ఘన నివాళి అర్పిస్తూ, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు, జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, కోశాధికారి కె.మురళి, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బి.జగన్నాథం, వి.వసంతనాయుడు, పట్టణ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డి.పోలినాయుడు, కె.గోవిందరావు, కొమరాడ, పార్వతీ పురం, జియ్యమ్మవలస మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కురుపాంలో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

పార్వతీపురంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్నయుటిఎఫ్ నాయకులు

పాలకొండలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న మాజీ సైనికోద్యోగులు

పాలకొండ : ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సానుభూతిగా స్థానిక స్టేట్ బ్యాంకు నుంచి కోట దుర్గ ఆలయం వరకు మాజీ సైనిక ఉద్యోగులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శేఖర్, పూర్వపాధ్యక్షులు దుప్పాడ పాపినాయుడు తదితరులు ఉన్నారు.

పార్వతీపురంటౌన్ : ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక కలెక్టరేట్ నుంచి చర్చివీధి జంక్షన్ వరకు సాగింది. అనంతరం ఉగ్రదాడుల్లో మృతి చెందిన వారికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

విద్యల నగరంగా పేరొందిన విజయనగరంలో ప్రభుత్వ విద్య ఉత్తమాటగానే మిగులుతోంది. పదోతరగతి తర్వాత ఎవరైనా ఇక్కడ ఉన్నత చదువులు కొనుక్కోవాల్సిందే తప్ప చదువుకునేందుకు అవకాశం లేకుండా పోతోంది. ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో ప్రైవేటు కళాశాలలే దిక్కవుతున్నాయి. దీంతో పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకు దూరమయ్యే దుస్థితి నెలకుంటోంది. జిల్లా కేంద్రం పట్టణ స్థాయి నుంచి నగర స్థాయికి ఎదిగినా ప్రభుత్వ విద్యారంగంలో మాత్రం పురోగతి లేదు. ఈ విషయంలో పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

పది తరువాత 'ప్రయివేటు'కే!

- ప్రభుత్వ కళాశాలలకు నోచుకోని విద్యలనగరం
- ఫీజులు చెల్లించలేక చదువు ఆపేస్తున్న పేద విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా కేంద్రంలో మూడు మున్సిపల్ హైస్కూళ్లు, మండల పరిధిలో సుమారు 12 వరకు జెడ్‌పి ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఏడాదికి వెయ్యి మంది విద్యార్థులకు పైగా ఇంటర్‌కు వస్తున్నారు. దీన్ని బట్టి కనీసం నాలుగు ఐదు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అవసరం ఉంది. కానీ జిల్లా కేంద్రంలో ఒకే ఒక్క జూనియర్, డిగ్రీ కళాశాలలు ఉండడం, అందులోనూ అధ్యాపకులు లేక, సౌకర్యాలు లేక పోవడంతో విద్యార్థులు వాటిలో చేరేందుకు ముందుకు రావడం లేదు. వీరంతా పేద విద్యార్థులు కావడంతో వేలల్లో ఫీజులు కట్టి ప్రైవేటు కళాశాలల్లో చేరేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ఇంటర్, డిగ్రీ కళాశాలు ప్రభుత్వం ఏర్పాటు చేస్తే వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

గతంలో ఎయిడెడ్ వ్యవస్థ రద్దుతో ఆయా కళాశాలల్లో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ప్రభుత్వ కళాశాలల్లో చేరిపోయారు. దీంతో వ్యాపారమే లక్ష్యంగా ఎంఆర్ కళాశాల యాజమాన్యం వ్యవహరిస్తోందనే విమర్శలు న్నాయి. చివరకు ఏకైక మహిళ ఎంఆర్ కళాశాలలో కూడా అధిక ఫీజులు చెల్లించుకొని ఇంటర్, డిగ్రీ, ఆ పైన చదువులన్నీ ప్రైవేటులో సాగాల్సిందే. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థులు పదో తరగతి వరకు చదువుకుని ఆ తరువాత చదువుకు పుల్‌స్టాప్ పెడుతున్నారు. ఆర్థికంగా ఇబ్బంది లేని వారు ఇక్కడి ప్రైవేటు కళాశాలల్లో లేదా ఇతర పట్టణాల్లోని కళాశాలల్లో తమతమ పిల్లలను చదివించుకుంటున్నారు. జిల్లా కేంద్రంగా ఇంటర్, డిగ్రీతో పాటు పీజీ కళాశాలలు ప్రభుత్వ పరంగా అందుబాటులో ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది.

విజయనగరంలో గత ప్రభుత్వంలో డిగ్రీ కళాశాల మంజూరైంది. కానీ భవనాలు లేక ,అధ్యాపకులు లేక కళాశాల అనేక సమస్యలతో నడుస్తుంది. ప్రైవేటు కళాశాలలకు వత్తాసు పలుకుతూ ప్రభుత్వ విద్యారంగం పట్ల ప్రభుత్వానికి, పాలకులకు ఎంత నిర్లక్ష్యం ఉందో దీనిని బట్టి అర్థం అవుతుంది. ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్‌తో పాటు డిగ్రీ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేస్తే ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసు కోవాలని విద్యార్థులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నిధులివ్వమంటే నోరెళ్లబెట్టారట!

ప్రజాశక్తి – విజయనగరం ప్రతినిధి

'గాదెలోని గింజలు గాదెలోనే ఉండాలట... గుంటడు మాత్రం గారకాయలా ఉండాలట'. ఉత్తరాంధ్రలోని ఈ తెలుగు సామెత ఇటీవల మన జిల్లాకు వచ్చిన రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడి తీరుకు, ప్రభుత్వ ఉదాసీనతకు అద్దం పడుతోంది. ఈనెల 21న ఈ అమాత్యులవారు జిల్లాలోని రామతీర్థసాగర్ ప్రాజెక్టు పరిశీలనకు రావడం, అదే రోజు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టు పనులపై సమీక్షా సమావేశం నిర్వహించడం విదితమే. జిల్లానే కాదు యావత్తు ఉత్తరాంధ్రనే సస్యశ్యామలం చేస్తామంటూ అధికార యంత్రాంగాన్ని, రైతాంగాన్ని ఊహల పల్లకిలో ఊరేగించేందుకు ప్రయత్నించారు. కానీ, అందుకు అవసరమైన నిధులు గురించి ప్రస్తావించిన అధికారుల వద్ద... అబ్బా.. అంతవుతుందా? అంతెందుకు... అంటూ పిసనారి లెక్కలు వేశారట. ఇప్పుడిదే జిల్లాలో పబ్లిక్ టాక్‌గా మారిపోయింది. అసలు సాగు నీటికోసం దశాబ్దాల తరబడి రైతులు ఎదురు చూస్తున్నారు. ఈనేపథ్యంలో పది నెలల క్రితం ఏర్పడిన కూటమి ప్రభుత్వం సాగునీటి కోసం ఏ సాయమైనా చేయకపోతుందా? అని ఎదురు చూడడం సహజమే. అమాత్యులవారు మాత్రం పాత సీసాలో కొత్త సారా అన్నట్టుగా డైలాగులు కొత్తగా వల్లెవేసినప్పటికీ, ఆ హామీలు మాత్రం

పాతవేనని జనం చర్చించుకుంటున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు సుమా..! జిల్లాలోని ప్రాజెక్టుల పరిస్థితి, భూ సేకవరణ, పునరావాసం, నష్టపరిహారం తదితర అవసరాల ఆధారంగా అవసరమైన నిధుల కోసం రెండు నెలల క్రితమే అంటే రాష్ట్ర బడ్జెట్ సమావేశాలకు ముందు తారకరామ, తోటపల్లి ప్రాజెక్టు అధికారులు స్పష్టమైన నివేదిక పంపారు. ఇరిగేషన్ రెగ్యులర్ ఇఎస్ కార్యాలయం నుంచి కూడా ప్రస్తుతం ఉన్న ప్రతిపాదనలకు అనుగుణంగా అవసరమైన నిధుల కోసం ఫైలు రాష్ట్ర కేంద్రానికి వెళ్లింది. వీటి ప్రకారం అప్పట్లో నిధులు కేటాయించలేదు. రామతీర్థసాగర్ నిర్మాణాల కోసం 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.807.55 కోట్లు అవసరం కానున్నట్టు అధికారులు ప్రతిపాదనలు రూపొందిం చగా, ప్రభుత్వం కేవలం రూ.64కోట్లు మాత్రమే కేటాయించింది. తోటపల్లి ప్రాజెక్టు పూర్తికి రూ.519.11కోట్లు అవసరం కానున్నట్టు కోరగా ఆచరణలో రూ.47.81 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇక ఇతర ఆంధ్ర, పెద్దగెడ్డ, తాటిపూడి తదితర జలాశయాలు, సాగునీటి కాలువల అభివృద్ధి కోసమూ అంతంతమాత్రమే కేటాయింపులు ఉన్నాయి. తాజాగా వచ్చిన జిల్లాకు వచ్చిన జలవనరుల అమాత్యులు ఉత్తరాంధ్రలోని సాగునీటి ప్రాజెక్టులకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తొలిపలుకులు పలకడంతో సాక్షాత్తు అధికార యంత్రాంగం కూడా సంబరపడింది. తీరా రెడ్డొచ్చే మొదలెట్టు అన్నట్టు నిధులు ఎంతెంత కావాలని అడుగుతునే ఆహా అంత అవుతుందా? అయితే సిఎం గారి దృష్టిలో పెడదాం అంటూ తిరుగుముఖం పట్టారు. నాగావళి నీటిని నాగావళి – చంపావతి ఇంటర్ లింకు చేయాలన్న మునుపు టిడిపి ప్రభుత్వం చేసిన ప్రతిపాదన గుర్తించి విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అశోక్ గజపతిరాజు అడిగిన ప్రశ్నకూడా అమాత్యులవారికి అర్థం కాలేదట. మొత్తానికి మంత్రిగారి పర్యటనలో నిధులపై స్పష్టత లేదని. సమావేశం ప్రాక్టికల్‌గా జరగలేదని పబ్లిక్ టాక్ వినిపిస్తోంది. దీంతో, మంత్రి పర్యటన కేవలం పార్టీని బలోపేతం చేసుకోవడానికే జరిగిందన్న అనుమానాలు కూడా వ్యక్తమౌతున్నాయి. చాలా మంది అధికారులతో మంత్రి మాట్లాడినప్పుడు మీ ఎమ్మెల్యేను కలిశావా? ఎందుకు ఇప్పటి వరకు కలవలేదు అన్న ప్రశ్నలకు ఇచ్చిన ప్రాధాన్యత జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల గురించి తెలుసుకునేందుకు ఇవ్వలేదు. ప్రభుత్వానికిగానీ, మంత్రిగారికిగానీ నిజంగా చిత్తశుద్ధి ఉంటే, ఇప్పటికే ప్రభుత్వం వద్ద నిధులకు సంబంధించిన అధ్యయనం చేసి, వాటిపై ప్రభుత్వం అంతర్గతంగా చర్చించి ప్రజల్లోకి వచ్చే వారని కూడా చర్చ నడుస్తోంది.

ప్రజాశక్తి
www.prajasakti.com

నివేదిక లేకుండా సమావేశాలకెందుకు?

ప్రజాశక్తి - భామిని

సర్వసభ్య సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు చేసిన పనులపై ప్రగతి నివేదిక లేకుండా వస్తే ప్రజాప్రతినిధులు దేనిపై సమీక్ష నిర్వహించాలని, ప్రగతి నివేదిక లేకుండా సర్వసభ్య సమావేశాలకు ఎందుకు వస్తున్నారని, నివేదిక లేకపోతే చేయాల్సిన అభివృద్ధి పనులు ఎలా తెలుస్తాయని అధికారులుని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి తోట శాంతికుమారి ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎండలు తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పనులు ఒక్కపూట నిర్వహించేలా చూడాలని ఎంపిటిసి కొత్త కోట చంద్రశేఖర్ కోరారు. ఈ అంశం కలెక్టర్ దృష్టికు తీసుకువెళ్లి, టెక్నికల్ అంశాలు చర్చించి వేసవిలో ఒక పూట ఉపాధి పని నిర్వహణ జరిగేలా చూస్తానని ఎమ్మెల్యేత తెలిపారు. రైతులు వ్యవసాయానికి తోడ్పడే చెరువులు, ఆయకట్టు, పూడికతీతకు సంబంధించి చేపట్టిన పనులు తనకు నివేదిక ఇవ్వాలని ఇరిగేషన్ ఎఇకి సూచించారు. గత ప్రభుత్వం నిలిపివేసిన బత్తిలి, వడ్డాంగి లిఫ్ట్ ఇరిగేషన్, భామిని కొండ లోయగెడ్డ రిజర్వాయర్ పనులకు నిధుల మంజూర అయ్యేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో పాఠశాల అభివృద్ధిలో భాగంగా మండలంలో 45 కాంపౌండ్ వాల్ మంజూరు చేశామని, వీటిలో 43 పూర్తి అయ్యాయని తెలిపారు. గ్రామాలలో చాలామంది నిరుద్యోగులు ఉన్నారని, వెలుగు ద్వారా సబ్సిడీపై అందిస్తున్న పరికరాలు, పథకాలను యువత అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదిగేలా అవగాహన కల్పించే బాధ్యత వెలుగు సిబ్బందికి ఉంటుందని ఆ దిశగా ప్రయత్నం చేసి, యూనిట్లను ఏర్పాటు చేయాలని వెలుగు ఎపిఎం చక్రపాణిని ఎమ్మెల్యే కోరారు. మండలంలో భూ సంబంధిత సమస్యలు అనేకం వున్నాయని, పరిష్కారం చేయాల్సిన రెవెన్యూ సిబ్బంది సర్వసభ్య సమావేశానికి రాకపోవడమేంటని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిసేపు అనంతరం వచ్చిన రెవెన్యూ సిబ్బందిని రెవెన్యూ సదస్సులో వచ్చిన సమస్యలను ఎంతవరకు పరిష్కరించారని ప్రశ్నించారు. సదస్సు నిర్వహించి

అధికారులను ప్రశ్నించిన ఎమ్మెల్యే జయకృష్ణ

బామిని: అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

మూడు నెలల గడుస్తున్నా, రైతు భూ సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడిలాగే వుందని పొంతన లేని సమాధానంతో రైతులను మోసం చేసినట్లు తనను మోసం చేయలేరని మండిపడ్డారు. సమస్యలపై రెవెన్యూ సిబ్బంది దృష్టి పెట్టాలన్నారు. మండలం అభివృద్ధి పరంగా చాలా వెనుకబడి వుందని, అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులుగా తమకు, ఉద్యోగులుగా మీకు వుందని, ఈ అంశంలో సక్రమంగా లేకపోతే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే అన్నారు. రాబోయే సర్వ సభ్య సమావేశానికి అధికారులు ప్రగతి నివేదికతో హాజరువ్వాలని ఆదేశించారు.ఈ సమావేశంలో ఎంపిడిఒ కె. సత్యం, ఎఎంసి చైర్మన్ సంధ్యారాణి, వైస్ ఎంపిపి బొనగడ్డి ధర్మారావు, మండలి ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం, మండలంలోని వివిధ శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శాఖలపై ప్రజాప్రతినిధులు గరం గరం

కురుపాం: సర్వసభ సమావేశానికి ప్రజా ప్రతినిధులు తీసుకొచ్చిన సమస్యలను అధికారులు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో సర్వసభ సమావేశం జరిగింది. తహశీల్దార్ ఎం.రవణమ్మ మాట్లాడుతున్నప్పుడు గుమ్మడి గూడ సర్పంచ్ శెట్టి సురేష్ తన గ్రామంలో పంట నష్టం పై హార్టికల్చర్ అధికారులు విఆర్ఒ, ఆర్ఐ సంతకం పెట్టినా తహశీల్దార్ సంతకం ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. దానికి ఆమె మాట్లాడుతూ తానే సుప్రీం తానే బాస్ తప్ప తాను ఎవరికీ సబార్డినేటర్ కాదని, ఎవరికీ సమాధానం చెప్పవలసిన అవసరం లేదని, తన దగ్గరికి ఎవరైనా వచ్చి అర్జీ పెట్టుకుంటే అప్పుడు తాను గాని తన సిబ్బందిని గాని పంపించి పర్యవేక్షిస్తామని చెప్పారు. అనంతరం పెద్దగోత్తిలి సర్పంచ్ టి. లోకనాథం తన పంచాయతీలో గ్రామ రెవెన్యూ అధికారులు ముటేషన్లకు రైతులు వద్ద నుంచి లంచాలు అధిక మొత్తంలో తీసుకుంటున్నారని ప్రస్తావించగా తహశీల్దారు వెంటనే స్పందించి రెవెన్యూ సిబ్బంది సమావేశం ఏర్పాటు చేసి అటువంటి చర్యలు ఎక్కడ జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారు. ఎఒ కె.నాగేశ్వరరావు వ్యవసాయ శాఖకు సంబంధించి మాట్లాడినప్పుడు పలువురు సర్పంచులు గ్రామస్థాయిలో వ్యవసాయ శాఖకు సంబంధించి జరుగుతున్న కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం కనీసం సర్పంచులకు ఉండటం లేదని అన్నారు. ఎన్నిసార్లు చెప్పినా ఎఒ పనితీరు మార్చుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు పాఠశాలలు శిథిలావస్థకు చేరుకున్నాయని సర్పంచులు ఎంఇఒ ఎన్. సత్యనారాయణ దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడతానన్నారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, వైస్ ఎంపిపిలు బి.అన్నాజీరావు, ఎ.రంగారావు, సర్పంచులు, ఎంపిటిసిలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

1 నుంచి వేసవి క్రీడా శిబిరాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మే 1 నుంచి 31 వరకు వేసవి క్రీడా శిబిరాలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 50 మందితో (25 మంది బాలురు, 25 మంది బాలికలు) వేసవి క్రీడా శిబిరాలను నిర్వహించాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు, సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 7గంటల వరకు క్రీడా శిబిరాలు జరుగుతాయని అన్నారు. అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్ బాల్, బాక్సింగ్, బ్యాడ్మింటన్, క్రికెట్, చెస్, ఫెన్సింగ్, హ్యాండ్ బాల్, హాకీ, కరాటే, కబడ్డీ, ఖోఖో, కిక్ బాక్సింగ్, టైక్వాండో, సాఫ్ట్ బాల్, వాలీబాల్, యోగా వంటివి నిర్వహిస్తామన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని 8 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలను గుర్తించి, వారిలో క్రమశిక్షణను నేర్పించడం, చిన్న వయస్సులోనే ప్రతిభావంతులైన ఆటగాళ్లుగా తీర్చిదిద్దడం దీని ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. అలాగే పిల్లలు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడమే కాకుండా క్రీడా కార్యకలాపాలను కొనసాగించేలా వారిని ప్రోత్సహించి మంచి ఆటగాళ్లుగా ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమని అన్నారు. కావున పిల్లలు ఈ సమ్మర్ కోచింగ్ క్యాంపుల్లో విరివిగా పాల్గొనాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

వైసిపి మండల అధ్యక్షులుగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని వడ్డంగి గ్రామానికి చెందిన బోదెపు శ్రీనివాసరావును వైసిపి మండల అధ్యక్షులుగా నియమిస్తూ వైసిపి అధిష్టానం శనివారం ప్రకటించింది. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర వైసిపి కమిటీ బోదెపు శ్రీనివాసరావు అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీనివాసరావు గతంలో వైసిపి రైతు మండల విభాగంలో అధ్యక్షులుగా పని చేశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పార్టీ పూర్తి బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఆయన నియామకం పట్ల మండల వైసిపి కార్యకర్తలు, నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. శ్రీనివాసరావు తండ్రి బొదెపు రఘుపతినాయుడు గతంలో బత్తిలి పిఎసిఎస్ చైర్మన్‌గా పనిచేశారు.

మాట్లాడుతున్న సిడిపిఒ రంగలక్ష్మి

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి- సీతంపేట

బాల్య వివాహాలు అరికట్టాలని సిడిపిఒ పి.రంగలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో సిహెచ్‌డబ్ల్యూలు, ఆశలు, ఎఎన్ఎంలు, విఒఎలతో సచివాలయ సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ కిషోర్ వికాసం శిక్షణ పొందిన కొంతమంది గ్రూపులు తయారై గ్రామాల్లో పిల్లలు డ్రాప్ అవుట్‌గా మారకుండా చూడాలన్నారు. తొందరగా గర్భిణులు అయితే వ్యాధులు సంభవిస్తాయని అవగాహన కల్పించాలన్నారు. పిల్లలకు యోగా వంటివి నేర్పించాలని చెప్పారు. మండలంలో వెంపలగూడ మినీ అంగన్వాడి కేంద్రంలో కార్యకర్త పోస్టుకు ఈనెల 28న ఐటిడిఎలో ఇంటర్వ్యూలు పిఒ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం పార్వతి, సూపర్‌వైజర్లు గౌరీ, లావణ్య, మిస్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించాలన్నారు. ఎక్కడైనా తాగునీటి బోర్లు మరమ్మతులకు గురైతే తక్షణ మరమ్మతులు చేపట్టాలన్నారు. పరిసరాలు పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు అందుబా టులో ఉండి సచివాలయాల ద్వారా సేవలు అందించాలన్నారు. ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ డి.వెంకటరమణ, ఇఒ బి.కోటేశ్వరరావు, సచివాలయాలు కార్యదర్శులు పాల్గొన్నారు.

అంకితభావంతో సేవలు అందించండి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

విధి నిర్వహణ సక్రమంగా చేసుకుని అంకిత భావంతో పనిచేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఇటీవల నూతనంగా ఎంపికైన అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు శనివారం ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ జాయినింగ్ ఆర్డర్ పత్రాలను ఎమ్మెల్యేకు చూపించగా ఆయన అభినందన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీరంతా ఎవరి ఒత్తిళ్లకు తలోగ్గ కుండా విధులు సక్రమంగా చేపట్టాలన్నారు. పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని సకాలంలో అందించాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల్లో ఎటువంటి సమస్యలున్నా తక్షణమే సంబంధిత సూపర్వైజర్లకు, అధికారులకు తెలియజేసి వాటిని పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, రౌతు వేణుగోపాల్ నాయుడు, బోను దేవి చంద్రమౌళి, ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ కోరాడ నారాయణరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

మస్తర్లను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ త్రివిక్రమరావు

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని వెంకటాపురంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రమారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలు ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పని చేస్తే వేతనాలు వస్తాయన్నారు. కనీస వేతనం కోసం ప్రతి వేతనదారుడు నిర్దిష్ట సమయాల్లో పని చేయాలన్నారు. ఫారం పాండ్ పనులు చేయాలన్నారు. జాబ్ కార్డు ప్రతి వేతనదారులకు పని కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే వేతలదారుల మస్తర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ అనంతరం వృద్ధులతో ప్రిన్సిపల్, తదితరులు

వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ ఎస్.కల్లిగొట్టులో వృద్ధులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ టి.శ్రీవరం చీరలు, దుప్పట్లు శనివారం పంపిణీ చేశారు. ఎటువంటి ఆదరణలేని నిరుపేద వృద్ధులకు సాయమందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రామయ్య, కళాశాల సిబ్బంది ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మేడే స్ఫూర్తితో మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం గరుగుబిల్లిలో వివిధ రంగాల కార్మికులతో సమావేశం నిర్వహించారు. సమ్మె జయప్రదం కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందని, కనీసం సంఘం పెట్టుకొని తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి తెలియజేసే అవకాశం లేకుండా రాజ్యాంగం కల్పించిన కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లను ప్రవేశపెడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలు, సంస్థలను బలహీనపర్చి కార్పొరేట్లకు అప్పజెప్పుతున్నారని విమర్శించారు. దేశ సంపదను కార్పొరేట్లకు అప్పజెప్పడంలో ఉన్న శ్రద్ధ కార్మికులకు, ప్రజలకు మేలు చేసేందుకు పాలకులు ఆలోచించడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేక తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని అన్నారు. దేశ అభివృద్ధిలో

గరుగుబిల్లి: ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కార్మికులు, ఉద్యోగుల పాత్ర ఎనలేనిదని, వారిపట్ల ప్రభుత్వాలు సానుకూల దృక్పథంతో ఆలోచించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మే 20న కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఈ సమ్మె నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సావిత్రి, కృష్ణవేణి, దమయంతి, అరుణ కుమారి, గౌరమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, మధ్యాహ్న భోజన నిర్వాకుల సంఘం నాయకులు రోహిణి, సిఐటియు మండల కార్యదర్శి దాసరి వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : మేడే స్ఫూర్తితో మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ, సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి అన్నారు. మే ఒకటో తేదీన మేడే కార్యక్రమం జయప్రదం చేయాలని, మే 20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో వివిధ రంగాల కార్మికులతో కలిసి అంగన్వాడి కొమరాడ ప్రాజెక్టు కార్యదర్శి ఎస్ అనురాధ అధ్యక్షన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందని కనీసం సంఘం పెట్టుకొని తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వానికి తెలియజేసే అవకాశం కూడా లేకుండా రాజ్యాంగం కల్పించిన కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్‌లను ప్రవేశపెడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు భారతి, లలిత, పద్మ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు సుజాత, ఐమా గంగమ్మ, సుమ వెంకటలక్ష్మి, మధ్యాహ్న భోజన నిర్వాకుల సంఘం నాయకులు జానకి తదితరులు పాల్గొన్నారు.

మంటలు అదుపు చేసిన అగ్నిమాపక అధికారులు

సీతంపేట: స్థానిక ఐటిడిఎ కార్యాలయానికి ఆనుకుని ఉన్న స్థలంలో గల రెల్లిపొదల్లో మంటలు చెలరేగాయి. దీంతో ఈ మంటలు పక్క కార్యాలయాలకు, నివాసాలకు వ్యాపించేలా ఉన్నాయని గమనించిన ఐటిడిఎ ఎపిఒ చినబాబు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే పాలకొండ అగ్నిమాపక అధికారి జె.సర్వేశ్వరరావు వచ్చి ఆధ్వర్యంలో మంటలను అదుపు చేశారు.

నేడు నీటి సరఫరా బంద్

పాలకొండ: స్థానిక నగర పంచాయతీ దగ్గర వాల్ రిపేర్ కావడంతో పట్టణంలోని పలు వార్డులకు ఆదివారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ రత్నంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 9, 10, 11, 12, 13, 14, 15 16 17 18 వార్డులకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు.

కిశోర వికాసంపై సమ్మర్ క్యాంపెయిన్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

చదువు మధ్యలో ఆపేసి బడికి వెళ్లలేని పిల్లలను గుర్తుంచి, వారి జీవన వికాసానికి తోడ్పాడేందుకు కృషి చేయాలని, అలాగే కిశోర వికాసంపై సమ్మర్ స్పెషల్ క్యాంపెయిన్ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరుగుతుందని కొమరాడ సిడిపిఒ గొట్టాపు సుగుణ కుమారి తెలిపారు. గరుగుబిల్లిలో కిశోరి వికాసం సమ్మర్ క్యాంపెయిన్ కార్యక్రమంపై శనివారం ఐసిడిఎస్, వెలుగు విఒఎలు వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమం గురించి తెలియజేసేందుకు ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఐసిడిఎస్ పిఒ సుగుణకుమారి మాట్లాడుతూ గ్రామాల్లో బడికి వెళ్తూ మధ్యలో మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. కిశోరి బాలికలకు సరైన విజ్ఞానం అందించి జీవితంలో అన్ని విధాలా ఎదిగేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గరుగుబిల్లి ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి, వెలుగు క్లస్టర్ కో-ఆర్డినేటర్ చందాన తిరుపతిరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన తహశీల్దార్

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

జియ్యమ్మవలస మండల నూతన తహశీల్దార్‌గా నడుపూరు చిన్నారావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి పుష్పగుచ్ఛం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆమె కోరారు.

ఏజెన్సీలో పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పహల్గాంలో ఉగ్రవాదులు పర్యాటకులపై చేసిన దాడుల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా పోలీస్ అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఆర్టీసీ బస్సుల్లో, కాంప్లెక్స్ పరిసరాల్లో, గుణుపూర్ కూడలి చెక్పోస్ట్ వద్ద సిఐ హరి, ఎస్ఐ బిడ్డిక శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తతంగా తనిఖీలు చేపట్టారు. ఒడిశా - ఆంధ్రా ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమాని తులను ప్రశ్నించి వివరాలు రాబట్టారు. అనుమాని తులపై ప్రత్యేక నిఘా ఉంచారు.

సీతంపేట: కారును తనిఖీ చేస్తున్న ఎస్ఐ

సాలూరు రూరల్ : ఇటీవల జమ్మూకాశ్మీర్‌లో జరిగిన పెహల్గాం దాడులు నేపథ్యంలో సాలూరు పట్టణంలో శనివారం బాంబు స్క్వాడ్, పోలీసుల ఆధ్వర్యంలో ఆర్టిసి కాంప్లెక్స్, తహశీల్దార్ కార్యాలయం, జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో, వాహనాలను విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ సిఐ బి.అప్పల నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

కురుపాం: వాహనదారులకు హెల్మెట్ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి అని నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు అన్నారు. శనివారం సాయంత్రం మండలంలో కాకిలి జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేనటువంటి వాహనదారులకు అపరాధ రుసుం వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి మద్యం సేవించకుండా రహదారి భద్రత నియమాలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని పిఎంఆర్‌సి

సాలూరు: సెల్‌ఫోన్ తనిఖీ చేస్తున్న సిఐ

జంక్షన్ వద్ద సీతంపేట ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో శనివారం వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీలు చేశారు. వాహనాల ధ్రువపత్రాలు పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, సి-బుక్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మితిమీరి వేగంతో వెళ్లరాదని చెప్పారు. ఓవర్ లోడ్ వేయరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని చెప్పారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో పోలీసులు పాల్గొన్నారు.

నవధాన్యాలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - పాచిపెంట

నవధాన్యాల సాగు మూడు నుంచి ఐదేళ్ల పాటు చేపట్టడం ద్వారా ఎలాంటి ఎరువులు వాడకుండానే, రసాయన ఎరువులు సగానికి తగ్గించి అధిక దిగుబడులు పొందవచ్చునని రైతులు రేయి వెంకట్రావు, లండ నారాయణరావు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ప్రాంతీయ శిక్షకులు హేమసుందర్ వద్ద తమ అనుభవాలను వివరించారు. గత మూడేళ్లుగా వేసవిలో పిఎండిఎస్ నవధాన్య విత్తనాలను వేసి పత్తి, మొక్కజొన్న మూడు ఎకరాల్లో సాగు చేస్తున్నానని, భూమి ఆరోగ్యం మెరుగుపడడం వల్ల రసాయన ఎరువులపై పెట్టుబడి తగ్గడమే కాకుండా ప్రస్తుతం దిగుబడి కూడా పెరిగిందని అమ్మవలసకు చెందిన రైతు రెయ్యి వెంకట్రావు అన్నారు. కర్రివలసలో తమ వరి వ్యవసాయ క్షేత్రంలో గత ఐదేళ్లుగా పిఎండిఎస్ నవధాన్య విత్తనాలను సాగు చేస్తున్నానని, ప్రస్తుతం ఎలాంటి రసాయన ఎరువులు వాడకపోయినా చుట్టుపక్కల రైతుల కంటే ఎక్కువగానే దిగబడి వస్తుందని, దీన్ని చూసి ఈ ఏడాది రైతులంతా నవధాన్యాల సాగుకు ముందుకు వస్తున్నారని రైతు లండా నారాయణరావు తెలిపారు. పది ఎకరాల పత్తి, మొక్కజొన్న క్షేత్రాల్లో ప్రస్తుతం పీఎండీఎస్ నవధాన్యాల వేస్తున్నానని, దీనివల్ల కలుపు రాకుండా ఉంటుందని, పంట

నవధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న ఎఒ తిరుపతిరావు

ఆరోగ్యంగా ఎదగడమే కాకుండా అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. అనంతరం హేమసుందర్ మాట్లాడుతూ మండలంలో రైతులు కొన్నేళ్లుగా మొక్కజొన్న తర్వాత మళ్లీ అదే పంట సాగు చేస్తుండడం వల్ల ఈ పంట రసాయన ఎరువులకు స్పందించడం, దిగుబడులు తగ్గుముఖం పట్టాయని అన్నారు. దీన్ని నివారించాలంటే పిఎండిఎస్ నవధాన్యాలు విత్తనాలు సాగు చేసి కలియ దున్ని మొక్కజొన్నతో పాటుగా బహుళ పంటలు వేసుకుంటే దిగుబడులు గణనీయంగా పెరగడమే కాకుండా భూమి భౌతిక స్వభావం మెరుగుపడి భూమిలో ఉన్న సూక్ష్మజీవుల వృద్ధి జరిగి పంటకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు అందుతాయని అన్నారు. కావున రైతులంతా తప్పనిసరిగా పిఎండిఎస్ నవధాన్య విత్తనాలను కలియదున్నాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి తిరుపతిరావు, ప్రకృతి సేద్య సిఆర్పిలు విజయ్, తిరుపతి నాయుడు, శ్రీను, సురేష్ కుమార్, సుమలత పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలోని లచ్చిరాజుపేటలో పార్వతీపురం డివిజన్ వ్యవసాయ అధికారి వెంకటరావు ఆధ్వర్యంలో రైతులకు నవధాన్య కిట్లు పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమి ఆరోగ్యం, మన ఆరోగ్యం, భావి తరాలు మనుగడ సాగాలి అంటే ప్రకతి వ్యవసాయం చేయాలని చెప్పారు. రీజనల్ టెక్నికల్ లీడ్ జి.హేమ సుందర్ మాట్లాడుతూ భూమిని నిరంతరం ఏదో ఒక పంటతో కప్పిఉంచాలని, దీనివల్ల భూమి తేమగా వుండి, నీటి సామర్థ్యం కలిగి ఉంటుందని తెలిపారు. వాన పాములు అభివృద్ధి చెంది, దిగుబడులు అధికంగా వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఎం శ్రీనివాసరావు, జి.అన్నపూర్ణ, శారద మాష్టారు, ట్రై